

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 28.0

## వెన్నుపోటు పేటెంట్ జగన్‌దే



» మంతెన రామరాజు

భీమవరం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వరుస కుంభకోణాలు బయటపడుతుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆ పార్టీ అధినేత జగన్ ప్రజల దృష్టిని మళ్లించడానికి ధర్నాలు, ఆరోపణలు చేస్తున్నారని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు విమర్శించారు. భీమవరంలో ఆయన మాట్లాడుతూ 'జగన్ తన తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచి తన పరిపాలన కాలం తొలి ఏడాదిలో పది శాతం కూడా హామీలు అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను నెరవేర్చాం. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు సంపాదించి ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించారు. శివ కుమార్ స్థాపించిన వైసీపీని కబ్జా చేసి ఆయనకు వెన్నుపోటు పొడిచారు. బాబాయిని గొడ్డలిపోటుతో హత్యచేసిన వారిని కాపాడుతూ ఆ కుటుంబానికి వెన్నుపోటు పొడిచారు. మద్య నిషేధంపై మాట తప్పి విష పూరితమైన నాసిరకం మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను హరించారు. మెగా డీఎస్సీపై మాట తప్పి నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారు' అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### జగన్‌లో మార్పురాలేదు : తోట

భీమవరం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): 2024లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ వెన్నుపోటు దినంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందని భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఎద్దేవా చేశారు.

# బదిలీల వేళ పదోన్నతులా ?

» ఏళ్ల తరబడి మారుమూల ప్రాంతాలకే పరిమితమైన వారికి అన్యాయం



ఏలూరు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల ప్రక్రియ జరుగుతుండగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతుల కౌన్సెలింగ్‌కు తెరతీయడం పలు సందేహాలకు, వివాదానికి దారితీస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్)గా పదోన్నతులు కల్పించడానికి బుధవారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. బదిలీల ప్రక్రియను నీరుగార్చేలా అయా బదిలీ స్థానాలను ఆశించే సీనియర్ రెగ్యులర్ ఏఎన్ఎంలకు నష్టం వాటిల్లజేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వ్యవహరిస్తున్నాయని వైద్య ఉద్యోగులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇలా పదోన్నతులను ముందుగానే ఇవ్వడం వల్ల ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారంతా మారుమూల ప్రాంతాలకే పరిమితం అవుతారని, దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖలో అన్ని కేడర్ల ఉద్యోగులకు బదిలీలను చేపట్టి రెండు వారాల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందులో బదిలీలకు ముందే పదోన్నతులు ఇవ్వాలని నిర్దేశించ లేదు. ముందుగా పదోన్నతులిస్తే అందుబాటులోవున్న మంచిస్థానాలను తాము కోల్పోతామని వారు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులను, రాష్ట్ర అధికారులను అభ్యర్థించినా అరణ్యరోదనే అవుతోందని ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖలో నియమితులై ఇపుడు ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) పదోన్నతితో వైద్య ఆరోగ్య శాఖలోకి రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రవేశిస్తున్న ఏఎన్ఎంల పట్ల తమకు అగౌరవమే దీలేదని, అయితే దశాబ్దాల తరబడి రెగ్యులర్ ఏఎన్ఎంలుగా మారుమూల ప్రాంతాల్లో రీడిప్లాయ్‌మెంట్ (వర్క్ అడ్జస్టమెంట్) కింద పనిచేస్తున్న వారికి తొలుత బదిలీలను కల్పించకుండా చేస్తున్న అన్యాయాన్ని సరిదిద్దాలనే అడుగుతున్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుదవారం నిర్వహించతలపెట్టిన పదోన్నతి కౌన్సెలింగ్‌ను అడ్డుకునేందుకు కొందరు వైద్య ఉద్యోగులు ప్రయత్నిస్తున్నట్టు సమా చారం. మరోవైపు పదోన్నతి కౌన్సెలింగ్ సాఫీగా జరిగేందుకు వీలుగా పోలీసు భద్రతను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు ఇప్పటికే కోరినట్టు ప్రచారం జరుగుతోంది.

### 256 మందికి పదోన్నతులు

పదోన్నతుల నిర్వహణకు రాష్ట్ర అధికారులు అనుమతించారని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని వివరణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 256 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఏ (ఫిమేల్) ఉద్యోగులుగా పదోన్నతులు ఇస్తున్నాం. పదోన్నతులతో వీరంతా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి వస్తారు. ఇది పూర్తయిన తర్వాత కేడర్ల వారీగా బదిలీలు చేపడతాం. జిల్లాలో వైద్య ఉద్యోగుల బదిలీలు భారీగానే ఉంటాయి.



పెనుగొండలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, జేసీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే పితాని

## రోజూ అరగంట యోగా చేస్తే చాలు

పెనుగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి):'రోజూ అర గంటపాటు యోగా చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా చేసే పనిలో ఆటంకాలు లేకుండా చూసుకోవచ్చు. నిత్యం యోగాసనాల అనేక రుగ్మతలను దూరం చేసుకునేందుకు వీలు ఉంటుంది' అని కలెక్టర్ నాగరాణి అన్నారు. మంగళవారం పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో యోగాంధ్ర 2025లో భాగంగా రెండు వేల మంది ఆసనాలు వేశారు. ఆరోగ్యానికి ఒక్కొక్క ఆసనం ఒక్కో మాత్రలా పనిచేస్తుందని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రోజూ యోగా అభ్యాసనం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారిణి, యోగా మాస్టర్ ట్రైనర్ బి.శిరీష, ఆయుష్ యోగా గురువులు బడుగు చంద్రశేఖర్, పడాల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం



» నిందితుడి అరెస్ట్.. ఆపై లాకప్‌లో బాలిక మేనమామ దాడి
» ఆకివీడులో దారుణం.. ఉద్రిక్తత.. కేసు నమోదు
7

## తణుకులో ఫేక్ కరెన్సీ ముఠా అరెస్ట్

## గుడ్డు.. బేజారు



» ధర వచ్చే వరకు అమ్మకాల నిలుపుదల
» వ్యాపారుల సిండికేట్‌తో రైతుల నిర్ణయం
7
» గుడ్డు రూ.5.40 నుంచి రూ.4.40కే

# ఆస్తులు అధికం.. పన్నులు స్వల్పం




మునిసిపాలిటీల్లో ఆస్తి పన్నులు

| | టార్గెట్ (రూ.కోట్లలో..) | పెంచింది (రూ.లక్షల్లో..) |
|---|---|---|
| భీమవరం | 4.95 | 18.48 |
| తాడేపల్లిగూడెం | 2.93 | 7.68 |
| తణుకు | 2.91 | 14.60 |
| పాలకొల్లు | 1.67 | 3.72 |
| నరసాపురం | 2.85 | 5.36 |
| ఆకివీడు | 0.51 | 0.23 |
| | 15.82 | 50.07 |

## మునిసిపాలిటీల్లో ఇదీ తీరు

» ఆస్తి పన్నుల్లో లొసుగులు పసిగట్టి సరిచేయాలని ప్రభుత్వం ఆదేశం
» జిల్లాకు రూ.15.82 కోట్లు టార్గెట్.. అధికారులు గుర్తించి పన్నులు విధించింది రూ.52 లక్షలు
» అంచనాలను అందుకోని యంత్రాంగం.. సర్వే నామమాత్రం.. గడువు 11 రోజులే

భీమవరం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి):'పట్టణాల్లో ఆస్తులు భారీగా ఉన్నాయి. మునిసిపాలిటీకి కట్టే పన్నులు మాత్రం నామమాత్రం. ఈ తేడా ఎక్కడ వుంది ? గత ప్రభుత్వం హయాంలో కొందరు తమ ఆస్తులను తక్కువగా చూపించి, పన్నులు అంతే మొత్తంలో వేయించుకునే వారు. ఫలితంగా మునిసిపాలిటీలు భారీగా ఆదాయాన్ని కోల్పోయేవి. ఇందులో ముందు వరుసలో వున్న మునిసిపాలిటీ భీమవరం. ఇప్పుడు పట్టణాల్లోని ఆస్తి పన్ను చెల్లింపుల్లో లొసుగులపై ప్రభుత్వం దృష్టి సారించింది. అదనపు నిర్మాణాలు చేపట్టినా పాత పన్నులనే చెల్లిస్తూ మున్సిపాలిటీలకు నష్టం పెట్టే వారి ఆస్తులను మదింపు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి మున్సిపాలిటీలోనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. తక్కువ మొత్తంలో పన్ను చెల్లించే ఆస్తులను గుర్తిస్తున్నారు. వాటిపై పన్ను పెంచుతూ డిమాండ్ నోటీసులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ ఆదాయాన్ని సొంతంగా ఖర్చు పెట్టుకునేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి నిధులపై ప్రభుత్వం అజమాయిషీ తగ్గింది. బిల్లులకు ఎటువంటి అవరోధం ఉండదు. ఇటువంటి వెసులుబాటు కల్పించడంతో ఆదాయం పెరిగితే మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయవచ్చని ఆశిస్తున్నారు. ఇప్పుడు లొసుగులను సరిచేసి వాటిపై పన్ను వేయడం ద్వారా ప్రతి మున్సిపాలిటీలోనూ 20 శాతం ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా భీమవరం మున్సిపాలిటీ పెంచాల్సి వుంది. తర్వాత తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం మున్సిపాలిటీలతోపాటు, ఆకివీడు నగర పంచాయతీలోనూ పన్ను పెంపు దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు జిల్లాలో రూ.15.82 కోట్లు అదనంగా పెంచాల్సి ఉంటుంది.

### గతంలో అందరికీ 15 శాతం

గత ప్రభుత్వంలో ఏటా అందరికీ పన్ను పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు పన్ను తక్కువగా ఉన్న ఆస్తులను పరిగణనలోకి తీసుకుని అదనపు నిర్మాణాలపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు దగ్గర పడుతోంది. ఈ నెల 15లోగా ఆస్తులను మదింపు చేసి అర్హత ఉన్న చోట పన్ను పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. 11 రోజులే గడువు ఉంది. గత ప్రభుత్వంలో ఇటువంటి కసరత్తు జరగలేదు. ప్రతి ఆస్తిపైనా 15 శాతం పన్ను పెరుగుతూ డిమాండ్ వచ్చేది. రెవెన్యూ సిబ్బందికి పెద్ద ప్రయాస ఉండేదికాదు. మున్సిపాలిటీల ఆదాయం పెరుగుతూ వచ్చింది. కానీ, పన్ను తగ్గించుకోవడానికి అప్పట్లో సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడం, లేదంటే అదనపు నిర్మాణాలు చేపట్టినా పన్ను వేయకుండా తప్పించుకున్నారు. అటువంటి ఆస్తులను ఇప్పుడు గుర్తించాలి. దానికోసం పట్టణాల్లో సర్వే చేస్తున్నారు. ఆస్తి పన్ను నమోదు కానీ ఇళ్లను, పన్ను తక్కువగా నమోదైన ఇళ్లను, గృహ నిర్మాణం కోసం తీసుకుని కమర్షియల్‌గా షాపులు నిర్మించిన వాటిని, కొత్తగా భవనంపై మరో అంతస్తు నిర్మించిన భవనాలను సర్వేలో గుర్తిస్తున్నారు. ఆరు మునిసిపాలిటీల కమిషనర్లతో సమీక్ష పూర్తయ్యింది. ఇచ్చిన లక్ష్యాలను చేరాలని ఆదేశాలు జారీచేశారు. మునిసిపల్ రెవెన్యూ విభాగం అధికారులు వార్డుల్లో ఇళ్లను జల్లెడ పడుతున్నారు.

## 32 శాతం మందికి రేషన్ పంపిణీ

భీమవరం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, అస్వస్థతతో మంచానికి పరిమితమైన వారికి, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్‌ను డీలర్లు అందజేస్తున్నారని కలెక్టర్ నాగరాణి తెలిపారు. మంగళవారం భీమవరం గాంధీనగర్‌లో మంచానికే పరిమితమైన గుమ్మళ్ల రామారావు, వృద్ధుడు సిద్ధిరెడ్డి రామారావు ఇళ్లకు డీలర్ నారి నరసింహారావు వెళ్లి పంపిణీ చేస్తున్న రేషన్ ప్రక్రియను కలెక్టర్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. జిల్లాలోని 1,052 రేషన్ డిపోల పరిధిలో ఐదు లక్షల 58 వేల 19 కార్డులకు గాను మూడో తేదీ నాటికి లక్షా 78 వేల 583 మంది(32 శాతం) లబ్ధిదారులు రేషన్ తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. 70,770 మంది దివ్యాంగులు, వయో వృద్ధులకు గాను 21,050 కార్డుదారుల ఇళ్లకు డీలర్లు తీసుకుని వెళ్లి రేషన్ అందించినట్లు తెలిపారు.

### ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి):నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని 55 ఆశ కార్యకర్తల పోస్టుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.గీతా బాయి తెలిపారు. ఈ నెల నాలుగు నుంచి పదో తేదీ వరకు ఖాళీలు వున్న చోట సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రతిభ ఆధారంగా నియామకాలు జరుగుతాయని తెలిపారు.

# యండగండి కొట్టొద్దు

## సర్ ప్లస్ వియ్యర్ చానల్, లాకులకు మరమ్మతులు చేయాలి

ఉండి, జూన్ 3(ఆంధ్రజ్యోతి):ఉండి మండలం యండగండి వద్ద వున్న సర్‌ప్లస్ వియ్యర్ ఛానల్, యండగండి లాకులు శిథిలావస్థకు చేరడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు మేజరు పనులు పూర్తి కాకపోతే వచ్చే వర్షాకాలంలో రైతులు తీవ్రంగా నష్టపోతారు. యండగండిలో ఉండి పంట కాలువను ఆనుకుని సర్‌ప్లస్ వియ్యర్ ఛానల్ నిర్మించారు. ఉండి పంట కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తే ఇందులోని నీటిని వియ్యర్ ఛానల్ గేట్లను పైకెత్తి యనమదుర్రు డ్రెయిన్‌లోకి విడిచి పెడుతుంటారు. ఈ చానల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో చానల్ నుంచి నీరు బయటకు వెళ్లకుండా ప్రమాదం జరగకుండా ఇసుక బస్తాలను గత వర్షాకాలంలో పెట్టారు. పంట కాలువలో నీరు బయటకు విడిచిపెట్టడం కోసం ఈ చానల్‌ను ఏర్పాటు చేశారు. కానీ యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహించిన దానిలో నీరు సరాసరి పంట కాలువలోకి చేరుతుంది. ఇది పెద్ద సమస్యగా మారింది. దీనిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

యండగండి లాకులను 1885లో బ్రిటీష్ కాలంలో నిర్మించారు. అప్పటి నుంచి సమస్యలు వస్తే చిన్న చిన్న మరమ్మతులు తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. గత వరదల్లో లాకులకు వున్న మూడు తలుపులకు ఒకటి తొలగించారు. నీటి ప్రవాహం వేగాన్ని అదుపు చేయడానికి ఆ రీతిగా చేశారు. లాకుల ఖానాకు తలుపును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. రివిట్‌మెంట్లు బీటలు ఇచ్చాయి. వీటిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. వీటి వెంబడి పది నుంచి 15 వేల ఎకరాలు సాగవుతున్నాయి.





సర్‌ప్లస్ వియ్యర్ ఛానల్ శిథిలం కావడంతో అడ్డుగా పెట్టిన ఇసుక బస్తాలు.. బీటలు తీసిన రివిట్‌మెంట్ గోడలు



### లాకులను అభివృద్ధి చేయండి

యండగండి లాకులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి. ఏటా సంభవిస్తున్న వరదలకు, తుఫాన్‌లకు ఈ లాకుల పరిస్థితి దారుణంగా వుంటుంది. లాకులను ఈ వేసవిలోనైనా అభివృద్ధి చేయాలి. లేకపోతే భారీ వర్షాలకు, తుఫాన్‌లకు లాకులు ప్రమాదస్థాయికి చేరతాయి. దీని వెంబడి వున్న వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. తద్వారా రైతులు నష్టపోతున్నారు. తక్షణమే అభివృద్ధి చేయాలి.

కొండపల్లి తవిటయ్య, రైతు

### అభివృద్ధి పనులను చేపట్టాలి



యండగండిలో సర్‌ప్లస్ వియ్యర్ ఛానల్ అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయాలి. పంట కాలువ ముంపు బారిన పడితే ఆ నీరు సర్‌ప్లస్ వియ్యర్ ఛానల్ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి వెళ్లాలి. అయితే అందుకు విరుద్ధంగా యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహించి పంట కాలువలోకి నీరు చేరి ప్రమాదకరంగా మారుతోంది.


- పీవీఎస్ గోపాలకృష్ణంరాజు, రైతు



యండగండి లాకులకు చివర తూము పాడవడంతో ఇంకా ఏర్పాటు చేయని తలుపు



## ఏలూరులో మరో కొవిడ్ కేసు



ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):ఏలూరులో మంగళవారం మరో మహిళ(55)కు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ వైద్యాధికారి నరేంద్రకృష్ణ తెలిపారు. జ్వరం, జలుబు, తదితర కొవిడ్ లక్షణాలతో ఆమె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికిరాగా వైద్య పరీక్షల్లో పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. జిల్లాలో కొవిడ్ పాజిటివ్ బాధితుల సంఖ్య 12కి చేరింది. ఏలూరు శాంతి నగర్‌కు చెందిన దంపతులు విజయవాడ ఆసుపత్రి నుంచి ఆరోగ్యంతో మంగళవారం డిశ్చార్జి అయ్యారు.

కొవిడ్ బాధితుల వైరస్ వేరియంట్ తెలుసుకునేందుకు ఇద్దరి శ్వాబ్‌లను పుణెలోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదిక రావడానికి 14 రోజుల వ్యవధి పడుతుంది.

# సొంతింటి కలకు రాయితీ పెంపు

» బీసీ, ఎస్సీలకు రూ.50వేలు
» ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు
» మూడో కేటగిరీ ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు మెలిక
» ఇళ్లు పూర్తయిన తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లో జమ



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాయితీని అదనంగా పెంచింది. ప్రధానమంత్రి ఆవాస యోజనలో భాగంగా గతంలో రూ.1.80 లక్షలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలకు రాయితీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అదనంగా పెంచింది. గతంలో ప్రకటించిన రాయితీతో లబ్ధిదారులు పెద్దగా నిర్మించుకోలేదు. జిల్లాలో 72 వేలు ఇళ్ల కేటాయిస్తే కనీసం 50 శాతం కూడా పూర్తయ్యే పరిస్థితి లేకపోయింది. ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ లబ్ధిదారులకు అదనపు రాయితీలు కల్పించారు.

### కాంట్రాక్టర్లకు నోటీసులు

జిల్లాలో మూడో కేటగిరీలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. లబ్ధిదారులు నిర్మించలేమని చెపితే ప్రభుత్వమే నిర్మించేలా కాంట్రాక్టర్‌లను నియమించింది. జిల్లాలో దాదాపు 6,900 ఇళ్ల మూడో కేటగిరీలో నిర్మించాలి. ఇప్పటి వరకు కనీస స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేయలేదని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. బిల్లులు మంజూరు చేసినా నష్టాలు వస్తున్నాయన్న ఉద్దేశంతో ముఖం చాటేశారు. అటువంటి కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణ కార్పొరేషన్ నోటీసులు జారీచేస్తోంది. తక్కువ మొత్తంలో నిధులు కేటాయించినా సరే ఇళ్ల పూర్తి చేస్తామంటూ రంగంలోకి దిగిన కాంట్రాక్టర్లు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో కేవలం రూ.1.80 లక్షలకు ఇళ్ల నిర్మాణం సాధ్యపడదు. అదే ఇప్పుడు కాంట్రాక్టర్‌లను ముచ్చెమటలు పట్టిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన అదనపు రాయితీ కాంట్రాక్టర్‌లకు ఇవ్వడం లేదు. ఇళ్ల పూర్తయిన తర్వాత లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనివల్ల కాం ట్రాక్టర్‌లు నిర్మాణానికి ముందుకు రావడం లేదు. మొత్తంపైన కాంట్రాక్టర్‌లకు మెలికపెట్టారు. లబ్ధిదారు లు అదనంగా సొమ్ములు చెల్లించిన ప్రాంతాల్లోనే కాంట్రాక్టర్‌లు నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. మిగిలిన చోట్ల నిలిచిపోయాయి. తీరా ప్రభుత్వం ఇచ్చే అదనపు రాయతీ లబ్ధిదారుల ఖాతాలో వేస్తామంటూ మెలిక పెట్టడంతో కాంట్రాక్టర్‌లు ఆయోమయంలో పడ్డారు. నిర్మాణాలపై ముందుకు రావడం లేదు.



గణపవరంలో సీమ చింతకాయలు

# ఆహా.. సీమ చింతకాయలు

» కిలో రూ.100- రూ.130 వరకు విక్రయాలు

» ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి : వైద్య నిపుణులు

గణపవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభించే సీమచింతకాయలు ప్రస్తుతం మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. వైశాఖమాసం నుంచి జ్యేష్ఠ మాసం వరకు విరివిగా లభించే ఈ కాయలు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడుతుంటారు. వేసవిలో పాఠశాలల సెలవులు సందర్భంగా పల్లెల్లో పొలాలు, పుంతలు, కాల్వగట్లపై ఉన్న చెట్ల నుంచి సీమచింతకాయలను సేకరించడంలో చిన్నారులు నిమగ్నమవుతారు. నగరాల్లోనూ, పట్టణాల్లోనూ ఈ కాయలు లభించడంతో అధికంగా కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.100 నుంచి రూ.130 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ రెండు నెలలు కూడా పలువురికి జీవనోపాధిగా ఉంటుంది. కొంతమంది మహిళలు గంపలతో ఇంటింటికి తిరుగుతూ మరికొంత మంది యువకులు తోపుడు బండ్లపైన, మోటారు సైకిళ్లపై రహదారుల వెంబడి విక్రయాలు చేస్తున్నారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ కాయలను గర్భిణులు తినకూడదు, తింటే గర్భవిచ్ఛిత్తి జరిగే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు.

### సీమ చింతకాయలతో ప్రయోజనాలు అనేకం



సీమచింతకాయలు మధుమేహవ్యాధి నియంత్రణలో ఉంచడానికి దోహదపడతాయి. విటమిన్-సి, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికమొత్తంలో ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని పలు వైరస్‌లు, బ్యాక్టీరియాలతో సమర్థవంతంగా పోరాడి రోగాల భారినపడకుండా కాపాడుతుంది. గుండెకు ఎంతో మేలు చేస్తుంది. రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. కేన్సర్‌తో పోరాడే గుణాలు పుష్కలంగా ఉంటాయి.

- కె.ప్రియాంక
ప్రభుత్వ వైద్యాధికారి

# గుబాళించిన మల్లెలు

## పెన్నాడపాలెంలో ఇంటిల్లిపాదికి ఉపాధి కల్పన



పెన్నాడపాలెం మల్లెతోటలో పూలు కోస్తున్న కూలీలు

**గుబాళించే మల్లెపూలను మహిళలు తలలో పెట్టుకునేందుకు అమిత ఆసక్తి చూపుతారు. వేసవి కాలం వచ్చిందంటే మల్లెపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ పూల నుంచి వచ్చే సువాసనను ఆస్వాదించి, ఆనందపడుతుంటారు. ఫిబ్రవరిలో మల్లెపూల ఉత్పత్తి మొదలై జూన్ వరకు మార్కెట్‌లో అధికంగా వస్తుంటాయి. పాలకోడేరు మండలం పెన్నాడపాలెంలో పూర్వీకుల నుంచి మల్లెపూల తోటలను పెంచి ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి అందిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.**

పాలకోడేరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) :

వివాహ, శుభకార్యాలు, పుట్టినరోజులకు, మరే మంచి కార్యక్రమం జరిగినా గుబాళించే మల్లెలు ఉండి తీరాల్సిందే. మల్లె పూలంటే ఇష్టపడని వారుండరు. మల్లెపువ్వు కనిపించిందంటే తెంపుకుని మహిళలు తలలో పెట్టుకుని తీరాల్సిందే. ఇంటి ఆవరణలో చిన్న స్థలం ఉంటే పెరట్లో మల్లెపువ్వు మొక్క పెంచుతుంటారు. ఈ మొక్కకు ఎవరైనా దాసోహం అయి తీరాల్సిందే. సినిమాల్లో మల్లెపువ్వుకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ మల్లెపువ్వుపై చాలా సినిమాల్లో సినీ పాటలు తెరకెక్కి ఆకట్టుకున్నాయి. అటువంటి మల్లెపువ్వులు వేసవి వచ్చిందంటే ఆరు నెలలపాటు ఆ గుబాళింపు ఏ పల్లెటూరిలో చూసినా, ఏ పట్టణంలో చూసినా మహిళల తలల్లో కనిపిస్తూనే ఉంటాయి.

### పూలలో రారాజు 'మల్లెపువ్వు'

మల్లెపూలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. పూలలో రారాజుగా పిలుచుకునే ఈ మల్లెపూలను పండించేందుకు రైతులు పోటీపడతారు. ఈ కోవలోనే పాలకోడేరు మండలం పెన్నాడపాలెంలో పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయ పంటను మరచిపోకుండా మల్లెపూల తోటలను వేసి గ్రామస్థులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారికి మల్లెలను అందిస్తూ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. సహజంగా మల్లెపూలంటే కడియం, రాజమహేంద్రవరం అని చెబుతుంటారు. కానీ పెన్నాడపాలెంలో పండించే ఈ మల్లెపూల గుబాళింపే వేరు. వ్యాపారాలు చేసుకునేవారు పెన్నాడపాలెంలో పండే మల్లెపూలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఉదయమే వచ్చి పువ్వుల్ని కోయించుకుని భీమవరం, శృంగవృక్షం, వీరవాసరం గ్రామాల్లో అమ్ముకుంటూ జీవనోపాధిని సాగిస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈపూలను కోస్తూ, అమ్ముతూ ఉపాధి పొందుతారు. సాయంత్రం సమయంలో వంద మొగ్గలు రూ.20 చొప్పున అమ్ముకుంటూ వేసవిని గడిపేస్తుంటారు.

### మల్లెలతో ఉపయోగాలెన్నో..!

మల్లెపూలను వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. తలలో చుండ్రు సమస్యను అరికట్టేందుకు మల్లెలు ఉపయోగపడతాయి. అలసిపోయిన కనులపై మల్లెపూలను కొద్దిసేపు ఉంచినట్లయితే కళ్లు సైతం చల్లబడతాయి. కొబ్బరి నూనెలో మల్లెపువ్వులు వేసి రాత్రంతా బాగా నానబెట్టి ఆ తర్వాత వాటిని మరగబెట్టి తలకు పట్టిస్తే కేశాలు ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా చల్లదనాన్ని ఇస్తుంది. మల్లెపువ్వులను ఫేస్‌ప్యాక్‌గా కూడా వాడుకోవచ్చు. మల్లెల్ని పేస్ట్‌గా చేసి కొద్దిగా పాలు కలిపి నెమ్మదిగా మసాజ్ చేస్తే ఎంతో బాగుంటుంది. మల్లెపువ్వుల రసం తీసి గులాబీ పువ్వుల రసంతో గుడ్డులోని పచ్చసొన రెండు స్పూన్లు చొప్పున ముఖానికి రాస్తే కాంతివంతంగా ఉంటుంది. మల్లెపూలలో విటమిన్ 'సి' పుష్కలంగా ఉండడం వల్ల దీనిని ఔషధాలలో వినియోగిస్తుంటారు.

### పువ్వులు కోయడమంటే చాలా ఇష్టం



వేసవి కాలంలో అమ్మమ్మకి తోడుగా మల్లె పువ్వులు కోస్తూ సరదాగా గడుపుతా. మల్లెపువ్వుల తోట అంటే చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి అమ్మమ్మ,తాతయ్య పండించే తోటలోకి వచ్చి పూలు కోస్తూ ఉంటా. సాయంత్రం సమయంలో ఇంటి వద్దకు వచ్చే వారికి పూలు అమ్ముతా.

-ఆరేపల్లి అవినాశ్, 8వ తరగతి విద్యార్థి

### మల్లెపూలకు మంచి డిమాండ్



పెన్నాడపాలెం తోటల్లో పండించే మల్లెపూలకు చాలా డిమాండ్ ఉంటుంది. చాలా దూరాల నుంచి వచ్చి మేము పండించే మల్లెపూలను కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. పెన్నాడపాలెంలో సాయంత్రమైందంటే మల్లెల గుబాళింపుతో తోటలు కళకళలాడతాయి. తోటలను చూస్తేనే తెలియని ఆనందం కలుగుతుంది.

- వీరగని వెంకట వినయ్
పెన్నాడపాలెం

### ప్రభుత్వం సహకరించాలి



పెన్నాడపాలెంలో ఒకప్పుడు ఏ మూలన చూసినా మల్లెపూల తోటలు కనిపించేవి. ప్రస్తుతం చాలా తోటలు తగ్గిపోయాయి. కష్టం తప్ప ఆదాయం రావడం లేదు. గ్రామంలోని మల్లెల గుబాళింపే వేరు. అటువంటి మల్లెపంటను పండిస్తున్న రైతులను ప్రభుత్వం పట్టించుకుని ఆర్థిక సాయం అందిస్తే మరింత బాగుంటుంది. రైతుల్లో కూడా ఉత్సాహం పెరుగుతుంది.

- వెంకటేశ్వరరావు, పెన్నాడపాలెం

# తీరనున్న కల

## తాడేపల్లిగూడెంలో అందుబాటులోకి ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్

## ప్రభుత్వ విప్ బొలిశెట్టి సారథ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పరుగులు





తాడేపల్లిగూడెంలో నిర్మాణం జరుగుతున్న ఇండోర్ స్టేడియం (ఇన్‌సెట్‌లో) స్విమ్మింగ్ పూల్

పెంటపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో వినోదం అందుబాటులోకి రానుంది. పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించనుంది. క్రీడాకారుల కల తీరనుంది. 2018 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో అప్పుడు మంత్రిగా ఉన్న పైడికొండల మాణిక్యాలరావు హయాంలో పట్టణంలో క్రీడాకారుల కోసం సుమారు రూ.2.50 కోట్లతో ఇండోర్ స్టేడియం, మరో 2.50 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 50 శాతంపైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. చివరిదశలో కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉండడంతో అప్పటి కాంట్రాక్టర్లు కొంత నిర్మాణం జరిగిన తరువాత పనులను ముందుకు తీసుకు వెళ్లకుండా వదిలేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. కనీసం నిర్మాణాలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. సగం నిర్మాణ పనులను యథావిధిగా వదిలేసింది. ఫలితంగా ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పనులకు మోక్షం వచ్చింది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో రెండు నిర్మాణాలకు సుమారు మరో రూ.2 కోట్లు వెచ్చించి పనులు ముందుకు తీసుకు వెళ్లనున్నారు. దీనికి ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు దాతలు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు.

### పీ4 విధానంతో పనులు

ప్రభుత్వం చేపట్టిన పీ4 విధానం ద్వారా ఈ రెండు పనులు పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు రెండింటికి కలిపి మరో రూ.1.50 కోట్లు వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో దాతల సహకారంతో పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం సుమారు రూ.30 లక్షలను ఎమ్మెల్యే బొలిశెట్టి ఖర్చు చేశారు. స్విమ్మింగ్ నిర్మాణం కోసం మరో రూ.5 లక్షలు సహకారం అందజేశారు. ప్రస్తుతం రెండు పనులను నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలోనే వీటిని ప్రజా సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

### టెన్నిస్, బ్యాడ్మింటన్ కోసం..

ఇండోర్ స్టేడియాన్ని టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం నిర్మాణం అవుతుంది. ఇప్పటివరకు పట్టణంలో క్రీడా కారుల కోసం ప్రత్యేకమైన గ్రౌండ్‌లు ఏమీ లేవు. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే బొలిశెట్టి సారథ్యంలో క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ఈతగాళ్లకు ఊరట..

తాడేపల్లిగూడెంలో ఇప్పటివరకు ఎక్కడా స్విమ్మింగ్ పూల్ లేదు. ఈత కొట్టేందుకు కాలువలోకి వెళ్లి చాలామంది యువకులు, విద్యార్థులు మరెందరో అసువులు బాసిన పరిస్థితులు చాలా ఉన్నాయి. ఇంతకాలానికి ఈత కొట్టే వారి కోరిక తీరనుంది. ప్రస్తుతం నిర్మాణం చేస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల నుంచి ప్రతీ ఒక్కరికి ఈత కొట్టడంలో శిక్షణ ఇచ్చేలా నిర్మాణం జరుగుతుంది.



మద్ది ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

## మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం,జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్వాయిగూడెం గ్రామంలో వున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఆంజనేయునికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి పలు సేవల రూపంలో రూ.2,23,162 ఆదాయం సమకూరిందని ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.





అలంకరణలో కుంకుళ్లమ్మ.. అంకురార్పణ జరుపుతున్న అర్చకులు, పండితులు.

## కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి ఉపాలయమైన ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో నయనానందకరంగా సుందరీకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణను అర్చకులు పునులూరి భైరవ నేతృత్వంలో పండితులు జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.



ఏలూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ధర్నా

## డిపో సీఐ ప్రవర్తనపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు డిపో కార్యదర్శి డి.ఆంజనేయులు పట్ల ఏలూరు ఆర్టీసీ డిపో సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా మంగళవారం ఏలూరు ఆర్టీసీ గ్యారేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ డిపో కార్యదర్శి ఆంజనేయులు పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. యూనియన్ నాయకులు, కమిటీ సభ్యుల పట్ల ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో సెక్రటరీ డి.ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం కొనసాగుతుందని బుధవారం నుంచి నాన్ కో-ఆపరేషన్ మొదలు పెడుతున్నామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో డిపో నాయకులు వీఎస్ నారాయణ, ఎండి రాజేష్, వీకేబీ రాజు, పి.శ్రీహరి మొదలగువారు నాయకత్వం వహించారు.

## సెకండరీ విద్య సంస్కరణలపై డీఆర్పీలకు శిక్షణ ప్రారంభం





మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు

ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ విద్య బోధించే స్కూల్ అసిస్టెంట్లకు నూతన విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్న పలు అంశాలపై శిక్షణనిచ్చే కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల శిక్షణ తరగతులు స్థానిక సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో మంగళవారం ప్రారంభమయ్యాయి. లాంగ్వేజెస్, నాన్-లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో 160మంది స్కూల్ అసిస్టెంట్లు, 14మంది హెచ్‌ఎంలను బృందాలుగా విభజించి శిక్షణ అంశాలపై చర్చాగోష్ఠులు, డివిజన్లు, మండలాల్లో చేపట్టాల్సిన శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కోర్సు డైరెక్టర్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసుకున్న డీఆర్పీలందరూ జిల్లాలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 3,250మంది స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులకు ఈనెల 8, 9, 10 తేదీల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నూతన విద్యాసంవత్సరంలో అమలుచేయనున్న టీచర్ హ్యాండ్‌బుక్, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్, కరికులం ఇంటిగ్రేషన్, అకడమిక్ కేలండర్‌లను ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశీలకునిగా విచ్చేసిన ఎస్సీఈఆర్టీ ప్రతినిధి రాజాబాబు మాట్లాడుతూ ఆరో తరగతి బాలబాలికలకు సంసిద్ధతా కార్యక్రమం, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు, 40 రోజుల బ్రిడ్జి కోర్సులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కొత్త విద్యాసంవత్సరంలో 1,2 తరగతులు, 9, 10 తరగతులకు హిందీ సబ్జెక్టులో నూతన సిలబస్ పాఠ్యపుస్తకాలు రూపొందాయని వెల్లడించారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్లు, దూబచర్ల 'డైట్' కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ క్రీడా స్కూల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

ఏలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారు వైఎస్ఆర్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 ఏడాదికిగాను 4, 5 తరగతి అడ్మిషన్లు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. 4వ తరగతి అడ్మిషన్‌కు 2015 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. 5వ తరగతి అడ్మిషన్‌కు 2014 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించినవారే ఉండాలని తెలిపారు. ఈనెల 20 నుంచి 25తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్క్రీనింగ్ షార్ట్‌లిస్ట్ చేసిన అనంతరం విడుదల చేసిన జాబితా ప్రకారం జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆయా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98663 17326 నంబరులో సంప్రదించాలన్నారు.



ఏలూరు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం

## రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సేవలు విస్తృతంగా చేయాలని, ప్రస్తుతం రెడ్‌క్రాస్ వద్ద ఉన్న రెండు డయాలసిస్ మిషన్లకు అదనంగా మరో రెండు డయాలసిస్ మిషన్లతో డయాలసిస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్, కార్యవర్గ కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించిన అనంతరం కార్యవర్గానికి ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాయ్‌హాన్ కాఫీ లిమిటెడ్ వారు అందిస్తామన్న మరో రెండు మిషన్లతో రక్త యూనిట్ల నిల్వలను పెంచి రెడ్‌క్రాస్ బ్లడ్ కేంద్రంలో నాణ్యమైన, సురక్షితమైన రక్తాన్ని అవసరమైన ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని సేవా కార్యక్రమాలలో ప్రథమ స్థానంలో ఉండేలా కమిటీ సభ్యులు అందరూ సమష్టి కృషి చేయాలని, అందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

### 'రెడ్‌క్రాస్'లో యోగాంధ్ర మాసోత్సవాలు

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసీమియా భవనంలో యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రెసిడెంట్ రెడ్‌క్రాస్ సొసైటీ కె.వెట్రిసెల్వి ఆదేశాలతో జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని రెడ్‌క్రాస్ భవనంలో జూన్ 21 వరకు ఉదయం ఏడు నుంచి 8 గంటల వరకు యోగా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థినులు, మానవత సభ్యులు యోగ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. అనంతరం యోగా గురువులు మైలవరపు లక్ష్మీనరసింహం, ఎం.మల్లికార్జునరావు మాట్లాడారు.

## ఎన్‌టీఆర్ క్రికెట్ విజేత 'విరాట్-11 జట్టు'

వేలేరుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వేలేరుపాడులోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన ఎన్‌టీఆర్ క్రికెట్ ట్రోఫీలో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. ఏప్రిల్ 23 నుంచి ప్రారంభమైన క్రికెట్ టోర్నీలో 56 జట్లు పాల్గొనగా 45 రోజుల పాటు మ్యాచ్‌లు జరిగాయి. ఫైనల్‌కి విరాట్-11 జట్టు కన్నాయిగుట్ట టీమ్‌లు రాగా మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ -11జట్టు గెలపొందింది. రన్నరప్‌గా కన్నాయిగుట్ట టీమ్ నిలిచింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో విరాట్-11 జట్టుకు రూ.50,116 మొదటి బహుమతిగా, రన్నరప్‌గా నిలిచి టీమ్‌కు రూ.25,116, 3వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12,116లను ట్రోఫీలకు టీడీపీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, సబ్‌ఇన్‌స్పెక్టర్ కేవీ రామారావు దాతల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వేలేరుపాడులో నిర్వహిస్తున్న ఎన్‌టీఆర్ క్రికెట్ టోర్నీకి విశేష స్పందన లభిస్తుందని విజేతలకు నగదు బహుమతులు అందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు శాఖమూరి సంజీవులు, టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టం రాంబాబు, టీడీపీ నాయకులు పసుపులేటి లక్ష్మయ్య, కొమ్మన వెంకటేశ్వరరావు, కురుమెళ్ల సుధాకర్, కోటిపల్లి ముత్యాలరావు, గొంది నాగేశ్వరరావు, బీరం అంజిబాబు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విరాట్-11టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



రిగ్ సామగ్రి వాహనాన్ని అడ్డుకున్న రైతులు

## లీజు సొమ్ము చెల్లించాలంటూ ఆందోళన

**ఓఎన్జీసీ వాహనాన్ని అడ్డుకున్న రైతులు**

ఇరగవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రిగ్ నిమిత్తం ఓఎన్జీసీ లీజుకు తీసుకున్న పొలాలకు సక్రమంగా సొమ్ము చెల్లించాలంటూ మంగళవారం ఇరగవరంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఇరగవరంలో ఓఎన్జీసీ రిగ్ నిమిత్తం 2023లో 21 మంది రైతుల నుంచి లీజు ప్రాతిపదికన 7.35 ఎకరాలు సేకరించింది. ఎకరాకు రూ. 81,200 చొప్పున ఏడాదికి రెండు దఫాలుగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుని ఒక దఫా సొమ్ము మాత్రమే చెల్లించారని అది కూడా కొంత మందికే వచ్చాయన్నారు. పొలాల్లో ఉన్న కొబ్బరి చెట్టుకు రూ. 6090, తాటిచెట్టుకు రూ.350, మామిడి చెట్టుకు రూ.7,283 పరిహారం చెల్లించేందుకు అంగీకరించినా నేటికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆరోపించారు. అయితే ఈ ప్రాంతంలో రిగ్ పడక పోవడంతో వాహనాల్లో సామగ్రిని తరలించే సమయంలో రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. రిగ్ నిమిత్తం ఐదేళ్ల అగ్రిమెంట్ అని చెప్పి అర్థంతరంగా ఖాళీ చేసి వెళ్ళిపోవడంపై రైతులు అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓఎన్జీసీ డీటీ జనార్దన్ మాట్లాడుతూ రిగ్ సైట్‌లో పక్క రైతులు భూములు కలవడం వల్ల సమస్య వచ్చిందని, సైట్ ఖాళీ చేసి రైతులకు అప్పగించే వరకు లీజు సొమ్ములు జమ చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చెట్ల సొమ్ము వారంలోగా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



## 'పాకా'కు బీజేపీ నాయకుల ఘన స్వాగతం

ఏలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణకు కలపర్రు వద్ద బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరితో పాటు జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇటీవల ఢిల్లీలో ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మంగళవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ఏలూరు మీదుగా భీమవరం వెళ్తున్న పాకా సత్యనారాయణను కలపర్రు వద్ద గారపాటి చౌదరి, బీజేపీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన పాకాకు రాజ్యసభ పదవి, ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రిగా అవకాశం దక్కిందని అది బీజేపీతోనే సాధ్యమని గారపాటి చౌదరి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, ఉంగుటూరు నియోజకవర్గం కన్వీనర్ శరణాల మాలతీరాణి, దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ గుమ్మడి చైతన్య, బీసీ నాయకులు అశోక్ గౌడ్, అడపా శోభారాణి, నగరపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మానవుల ప్రధాన శత్రువులు దోమలే!



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

పెదవేగి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మానవులకు దోమలు ప్రధాన శత్రువులని, వాటి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా పెదవేగి పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో మలేరియా ప్రబలే విధానం, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా మలేరియా అధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా ప్రజలు అధికంగా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దోమల వ్యాప్తిని అరికడితే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వలేకుండా చేస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి, సహాయ మలేరియా అధికారి జె. గోవిందరావు, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, పీహెచ్‌ఎన్ మంగమ్మ, సూపర్‌వైజర్లు రమేష్, యామిని, సుజాత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

ఏలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ చైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ ఏలూరులో వేర్వేరుగా బుధవారం పదవీ ప్రమాణ స్వీకారాలు చేయనున్నారు. డీసీసీబీ కార్యాలయంలో వీరాంజనేయులు, డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం వద్ద డీసీఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## చింతమనేనికి గన్ని ఆహ్వానం

పెదవేగి, జూన 3(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్‌గా బుధవారం ఏలూరులో జరిగే ప్రమాణ స్వీకారానికి, అలాగే 6న ఆప్కాబ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు రావాలంటూ డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌గా ఎన్నికైన గన్ని వీరాంజనేయులు దుగ్గిరాలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిసి సాదరంగా ఆహ్వానించారు.

## అనవసరంగా ఎరువులు వాడవద్దు

**రైతులకు శాస్త్రవేత్తల సూచన**

అత్తిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు సార్వా పంటకు అనవసరంగా ఎరువులు వాడవద్దని మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఆనందకుమార్ కోరారు. అత్తిలి మండలం పాలూరు కమ్యూనిటీ హాల్ భవనంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్ములో తప్ప ఇతర సమయంలో కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని సూచించారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ తోటలపై ఆయిల్‌పామ్ శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్ అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దిబోరా, మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్వారి సురేష్, పాలూరు సర్పంచ్ దయామణి, ఉప సర్పంచ్ రాపేటి సింహాచలం, పాలూరు, కొమ్మర, ఈడూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలి : ఎంవీఐ



ఏలూరు క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించవచ్చునని ఎంవీఐ పి. రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అలాగే కారు తదితర వాహనాలను నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యపానం చేసి వాహనాలు నడపరాదన్నారు. ఆర్సీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు తదితర వాహన పత్రాలను వాహనంతో పాటు ఉంచుకోవాలన్నారు.

# గుడ్డు.. బేజారు

- ధర వచ్చే వరకు అమ్మకాల నిలుపుదల... వ్యాపారుల సిండికేటుతో రైతుల నిర్ణయం
- గుడ్డు రూ.5.40 నుంచి రూ. 4.40లకే కొనుగోలు... ఇలాగైతే పౌల్ట్రీ మనుగడ కష్టమే



తణుకు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. బెంగాల్ వాస్తవంగా గుడ్డులకు భారీగా డిమాండ్ ఉంది. కాని బెంగాల్, బీహార్ ట్రేడర్లు స్థానికంగా సిండికేట్ అయ్యి రైతులకు ధర విషయంలో భారీగా కోత విధిస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక, నష్టాలు భరించలేక తమ ఉత్పత్తి చేసిన గుడ్డులు తమ వద్దే ఉంచుకునేలా రైతులు మూకుమ్మడిగా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల బర్డ్‌ఫ్లూతో పౌల్ట్రీ రంగం కుదేలైంది. వేసవిలో ఉత్పత్తి తగ్గిపోవడం సర్వసాధారణం, దీనికి తోడు ట్రేడర్ల మాయాజాలంతో మరింత కుంగిపోయేలా వ్యవహరించడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

### జిల్లాలో 90 లక్షల గుడ్లు ఉత్పత్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీలలో కోటి 30 లక్షల కోళ్లు ఉన్నాయి. వాటి నుంచి ప్రతిరోజు సుమారుగా 90లక్షల గడ్ల ఉత్పత్తి అవుతున్నాయి.చిన్న, పెద్ద రైతులు 230 మంది వరకు ఉంటారు. స్థానికంగా 30లక్షల గుడ్లు వరకు విక్రయాలు జరుగుతాయి. మిగిలిన 70 లక్షలు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ప్రధానంగా పశ్చిమ బెంగాల్, కోల్‌కతా, బీహార్, ఒడిశా, కర్నాటక వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ డిమాండ్ ఉన్నప్పటికీ కావాలనే ట్రేడర్లు రైతుకు నష్టం వచ్చేలా ధరలు నిర్ణయం చేస్తుండటం మింగుడుపడటం లేదు. కనీసం నెక్ ధర ఇచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

### సౌత్ మార్కెట్ ఓకే..

సౌత్ మార్కెట్‌లో గుడ్డు ధర బాగానే పలుకుతోంది. అక్కడ రైతుకు అనుకూలమైన ధర లభిస్తోంది. హైదరాబాదులో 5.50, తమిళనాడులో 5.60, కర్నాటకలో 6.00, కోల్‌కతాలో మాత్రం ధరను భారీగా తగ్గించి 4.40 పైసలుగా చెబుతున్నారు. ఇది మన రైతులకు మాత్రం అంతుచిక్కడం లేదు.

### అంతా ట్రేడర్స్ హవా

గుడ్డులు ఎగుమతుల విషయంలో ట్రేడర్స్ హవానే కొనసాగుతోంది. నెక్ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసిన సందర్భాలు తక్కువగా ఉంటాయి. నెక్ ధరకు తక్కువగా కొనుగోలు చేయడంతో పాటు కమీషన్ కూడా తీసుకుంటారు. కష్టపడి ఉత్పత్తి చేసిన రైతుకు మాత్రం నష్టాలు మూటకట్టుకోవాల్సిన వస్తోంది. ప్రధానంగా కోల్‌కతా ట్రేడర్లు, బెంగాల్‌కు చెందిన ట్రేడరు స్థానికంగా ఉంటూ ఇరువురు సిండికేట్ అయ్యి ధరలు తగ్గిస్తున్నారని రైతులు బలంగా నమ్ముతున్నారు. నెక్ ధర ఇచ్చే వరకు మూడ్రోజులైన సరే రైతులు వెనక్కి తగ్గి అవకాశం లేదని చెబుతున్నారు.

### వారం రోజులుగా తగ్గిస్తూ..

గుడ్ల ఎగుమతుల విషయంలో రైతులు ఇప్పటికిప్పుడు నిర్ణయం చేయలేదు. వారం రోజులుగా ట్రేడర్లు రైతులను ఏమార్చి ధరలు తగ్గిస్తూ వస్తున్నారు. వారం రోజులుగా ఈ వ్యవహారం కొనసాగుతోంది.5.40 పైసలు నుంచి వారం రోజుల నుంచి ఇప్పుడు 4.85 పైసలు నెక్ ధరగా నిర్ణయించారు. కాని ట్రేడర్లు 4.40కే రైతులను విక్రయించాలని చెబుతున్నారు. దీంతో రైతులు గిట్టుబాటు కాక ఎగుమతులు నిలుపుదల చేశారు.

### కావాలనే ధరల తగ్గింపు..

**మల్లిన శ్రీనివాసరావు, గోదావరి నెక్ చైర్మన్**



ట్రేడర్స్ కావాలనే ధరలు తగ్గిస్తున్నారు. ట్రేడర్ల నిర్ణయం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోల్‌కతాలో ధర లేదని చెబుతూ ఇక్కడ తగ్గిస్తున్నారు. వాస్తవానికి అక్కడ ధర బాగానే ఉంది. అలాగే డిమాండ్ ఉంది. పరిస్థితులు ఇలానే ఉంటే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ కష్ట సాధ్యంగా ఉంటుంది. నెక్ ధర వచ్చే వరకు రైతులు నిర్ణయం కొనసాగుతుంది.

## జగన్ వ్యాఖ్యలపై ఫైర్

ఏలూరు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచి ఓటమిని చవిచూసిందని విమర్శించారు. ఈ నెల 4న ప్రజా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినంగా నిరసన తెలుపుతామని వైసీపీ అధిష్ఠానం పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసకర దుస్థితికి చేర్చిన ఘనత వైసీపీదే అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల దృష్టిని మళ్ళించడానికే డ్రామాలాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు.

## అవినీతిపై చర్యలు తీసుకోండి

ఏలూరుటూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో అవినీతి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 2020 - 24 సంవత్సరాల మధ్యకాలంలో విధులు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం 498జీఓ సర్క్యులర్ జారీ చేసింది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఆ మధ్యకాలంలో వచ్చిన ఆరోపణలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఏసీబీ నివేదికలో ప్రభుత్వానికి పంపగా ప్రభుత్వం సంబంధిత అధికారులపై డిసప్లేనరీ యాక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వై.శ్రీనివాస్, ఏసీపీ శాంతిలత, సూపర్‌వైజర్ ఎస్.సాంబశివరావు, టౌన్ సర్వేయర్ వెంకట్రమణ, డీటీపీఓ చాందిని, చైన్‌మ్యాన్‌లు వీ.శ్రీనివాస్, రవికుమార్, అజీత్, సెక్షన్ సూపర్ వైజర్ డీవీకే.సురేశ్, వార్డుప్లేనర్స్ ఎస్.వీణాకుమారి, వెంకటలత, అప్పటి కమిషనర్ షేక్ షాహిద్, ఈడా వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌లపై చర్యలు తీసుకోవాలని సురేశ్‌కుమార్ ఆదేశాల జారీ చేశారు.

## పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు

- ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

చింతలపూడి, జూన్ 3(ఆంధ్రజ్యోతి):చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. చింతలపూడి ప్రాంతంలో కోకో 40 శాతం పండిస్తున్నారని, దీంతో చాక్లెట్ పరిశ్రమకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రాంతంలో కోకో, బటర్, మాస్ తదితర ఉత్పాదక మార్కెటింగ్ అంశాలపై ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర స్థాయి అధికారులు, ఇన్వెస్టర్లు, కోకో ఫర్మంటేషన్ ప్రతినిధుల సమావేశం జరిగిందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సముకత వ్యక్తం చేశారని అన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఉపాధిఅవకాశాలు పెరుగుతాయని, పట్టాయిగూడెంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 69.5 ఎకరాల స్థల సేకరణ పూర్తయ్యి శంకుస్థాపన జరిగిందన్నారు. మరిన్ని పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు.



చేతివృత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

## చేతివృత్తిదారులను ఆదుకోవాలి

**చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**

ఏలూరుకార్పొరేషన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని చేతివృత్తిదారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం స్ఫూర్తి భవనంలో జరిగిన సమావేశానికి చేతివృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కేవలం చేతివృత్తిదారుల ఓట్లు పొందడానికి మభ్యపెట్టే వాగ్దానాలు చేయడం, ఆ తరువాత వారి సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వలన నిస్సహాయ స్థితిలో చేతివృత్తిదారులు నేటి మార్కెట్ పోటీని తట్టుకోలేక తమ వృత్తులను వదిలిపెట్టి అర్థాకలితో జీవిస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం సాధారణ చేతివృత్తిదారులను ఏ మాత్రం ఆదుకోలేకపోయిందన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏపీ గొర్రెలు, మేకల సంఘం అధ్యక్షులు పొట్లేలు పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసడాంగే, కోశాధికారి పుప్పాల కన్నబాబు, సంఘ నాయకులు మాగంటి సూర్యనారాయణ, బళ్ళ కనకదుర్గారావు, యర్రా వెంకటేశ్వర్లు, బుగ్గల ప్రభాకర్, కనకం జగన్, పి.నాగేశ్వరరావు, ఎ.త్రిమూర్తి పాల్గొన్నారు.

## ఘనంగా కొర్రాజులు పెద్దమ్మతల్లి జాతర



జీలుగుమిల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ములగలంపల్లిలో కొర్రాజులు పెద్దమ్మతల్లి జాతరను గిరిజనులు సాంప్రదాయబద్దంగా నిర్వహిస్తున్నారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ జాతర గిరిజనులు వారం రోజులపాటు జరుపుతారు. ప్రధానంగా అ మ్మవారు గద్దె ఎక్కడం, నిత్యదీపారాధనలు, బియ్యం కొలవడం వనదేవతల్ని తీసుకురావడం కోర్కెలు నెరవేర్చేందుకు నిప్పులగుండం కార్యక్రమం వంటి ప్రత్యేక పూజలు వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామ పెద్దలు బేతిన దుర్గారావు, జిన్నె వెంకటేశ్వరరావు, గోపిన రాము, బేతిన ప్రభాకర్ కమిటీ సభ్యులున్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆదివాసీలు

## 20వ రోజుకు ఆదివాసీల దీక్షలు

బుట్టాయగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం కోసం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారానికి 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఏజేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య ప్రారంభించి మద్దతుగా దీక్షల్లో పాల్గొన్నారు. ఆదివాసీలు 20 రోజులుగా దీక్షలు చేస్తుంటే ప్రభుత్వానికి కానరాకపోవడం బాధకరమన్నారు. దీక్షల్లో సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరావు, ఉయికె బుజ్జి, జేఏసీ నాయకులు కుంజా కృష్ణంరాజు, తెల్లం శ్రీను, పూనం శ్రీను, కుంజా రమేష్, తెల్లం గంగరాజు పాల్గొన్నారు.

**క్రైం సమాచారం**

## కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

భీమడోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి బాధ భరించలేక ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమడోలు మండలం అన్నేవారిగూడెంలోజరిగింది.భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన అన్నెపు దుర్గాప్రసాద్(35) విపరీతంగా కడుపునొప్పి వచ్చిందని బాధ భరించలేక మంగళవారం పురుగుల మందు తాగి చనిపోయినట్టు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## యువతి పేరుపై ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతా

- అసభ్యకరమైన మెసేజ్‌లపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి పేరుపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్‌ను ఓపెన్ చేసి అందులో అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టిన ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు వన్‌టౌన్‌లోని ఒక యువతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టే ఫోటోలను మరో గుర్తు తెలియని వ్యక్తికాపీ చేసి ఆ యువతి పేరుపైనే మరో ఇన్‌స్టాగ్రామ్ నకిలీ అకౌంట్ ఓపెన్ చేసి అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టడంతో గుర్తించిన బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాకీ చెల్లించలేదని యువకుడి కిడ్నాప్ ఆపై దాడి

ఏలూరు క్రైం : డబ్బులు ఇవ్వాలని ఒక యువకుడిని అడ్డగించి అతడి దగ్గర ఉన్న మోటారు సైకిల్‌ను తీసుకుని అతడిని కూడా కిడ్నాప్ చేసి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరడంతో ఎమ్మెల్సీగా నమోదు చేశారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన జొన్నకూటి ఆంజనేయులు ఏలూరుకు చెందిన నాని వద్ద రూ.20 వేలు తీసుకున్నాడని ఆ సొమ్ములు ఇవ్వడం లేదని ఆగ్రహించిన నాని అంజనేయులను మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అడ్డగించి బైక్‌తో పాటు అతడిని నిర్మానుష్య ప్రదేశానికి నానితో పాటు మరికొందరు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశాడు. నానితో పాటు మరి కొందరిపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

## పెళ్లింట విషాదం

**వంట గ్యాస్ లీకై ఏడుగురికి తీవ్ర గాయాలు**

పెనుగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వివాహం జరగాల్సిన ఇంటిలో విషాదం నెలకొంది. బుధవారం సాయంత్రం పెళ్లి జరగాల్సిన ఇంటిలో వంట గ్యాస్ లీకై ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం పెనుగొండలో జరిగింది. స్థానిక కొండపల్లివారి వీధిలో ఉంటున్న ఇవ్వల నాగేశ్వరరావు ఇంటిలో తన కుమారుడు శ్రీనివాసరావు వివహం బుధవారం జరగాల్సి ఉంది. వివాహం నిమిత్తం బంధువులు, కుటుంబ సభ్యులు ఆనందంగా గడుపుతున్న సమయంలో ఉదయం టిఫిన్ నిమిత్తం గారెలు వేస్తుండగా స్టవ్ వద్ద ఉన్న పైపు ఊడిపోవడంతో మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ఏడుగురు గాయాలపాలయ్యారు. పెళ్లి కొడుకు ఇవ్వల శ్రీనివాస్, పెద్దమ్మ కవిటంకు చెందిన అయినపర్తి లక్ష్మి, మావయ్య అత్త నరసింహరావు, సత్యవతి, సూర్య హనుమంతరావు, అతడి భార్య నాగమణి, మాచవరపు వీరేంద్ర తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడినవారిని మొదట పెనుగొండ సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి తణుకు ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు సమచారం. ఇంటిలో ఉన్న వాషింగ్ మిషన్, ఏసీ పూర్తిగా దగ్ధమైంది.



కాలిపోయిన వాషింగ్ మెషీన్

# చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం

- పోలీసుల అదుపులో నిందితుడు
- లాకప్‌లో అతనిపై బాలిక మేనమామ బ్లేడ్‌తో దాడి
- ఆకివీడులో దారుణం.. నిందితుడికి వ్యతిరేకంగా ఆందోళన





బ్లేడ్ దాడిలో గాయపడ్డ మీరావలి.. పోలీసు స్టేషన్ వద్ద బాలిక బంధువులు, పార్టీల నాయకుల ఆందోళన

ఆకివీడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆకివీడు వారపుసంత (సంతమార్కెట్)లో దారుణం చోటుచేసుకుంది. బతుకుదెరువు కోసం తిరుపతి నుంచి ఆరు నెలల క్రితం దంపతులు తమ ఏడేళ్ల కుమార్తెతో స్థానిక సంతమార్కెట్‌లోని పడాలవీధికి వచ్చి అద్దెకు ఉంటున్నారు. తల్లిదండ్రులు కూలిపనులు చేసుకొంటూ పిల్లను చదివించుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ చిన మీరావలి (70) (మాంసం వర్తకుడు) సోమవారం ఆరు బయట ఆటలాడుకుంటున్న బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముందుగా మీరావలిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బాలికకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి శాంపిల్స్ విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. అయితే వైద్యులు, పోలీసులు తమకు న్యాయం చేయరంటూ ప్రభుత్వాసుపత్రి దగ్గర స్టేట్‌మెంట్‌పై తల్లి సంతకం పెట్టలేదు. అనంతరం బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. నిందితుడిని తమకు అప్పగించాలంటూ పోలీసులతో వాదనకు దిగారు. కొందరు సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజుతో ఘర్షణ పడ్డారు. ఈ తరుణంలో లోపలికి బాలిక మేనమామ వెళ్లి లాకప్‌లో ఉన్న నిందితుడు మీరావలిపై దాడి చేసి బ్లేడ్‌తో గాయపర్చాడు. అనంతరం బాలిక మేనమామ పోలీస్ స్టేషన్‌లో సొమ్మసిల్లి పడిపోయాడు. మీరావలిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ జయసూర్య ఆకివీడు ఆసుపత్రిలో మీరావలిని పరిశీలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో బాలిక మేనమామ చికిత్స పొందుతున్నాడు. డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ఎస్ఐ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మేనమామపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

**నిందితుడిని శిక్షించాలి : టీడీపీ శ్రేణులు**

నిందితుడు మీరావలిని కఠినంగా శిక్షించాలని డీఎస్పీ జయసూర్యకు టీడీపీ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. మీరావలికి పార్టీలో ఎటువంటి ప్రాతినిధ్యం లేదన్నారు. పార్టీ అభిమానంతో పొందిన సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు తెలిపారు.

**బాధితురాలికి న్యాయం చేయాలి : ఐద్వా**

మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా మహిళలు ఎస్ఐ హనుమంతు నాగరాజుకు వినతిపత్రం అందచేసి బాధితురాలకి న్యాయం చేయాలని కోరారు.

## మేలో 1,684 కేసులు నమోదు

- రూ.1.03 కోట్ల అపరాధ రుసుం విధింపు



ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మే నెలలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా రవాణా, వ్యక్తిగత వాహనాలపై 1,684 కేసులు నమోదు చేసి రూ.1.03 కోట్లను అపరాధ రుసుంగా విధించామని ఉపరవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. ఇందులో పన్ను చెల్లించని, పర్మిట్, ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఓవర్లోడ్, డ్రైవింగ్ లైసెన్సు లేనివి, హెల్మెట్, సీటు బెల్టు, ధరించని తదితర కేసులు నమోదయ్యాయన్నారు. రూ. 62లక్షల11 వేలు వసూలు చేశామన్నారు. పన్ను చెల్లించని 72 వాహనాలను సీజ్ చేశామన్నారు. పన్ను చెల్లించని రవాణా వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని, స్వచ్ఛందంగా పన్ను చెల్లించినట్టయితే పన్నుతో పాటు 50 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు.

## ఫేక్ కరెన్సీ ముఠా గుట్టురట్టు / తణుకులో ఐదుగురి అరెస్ట్



తణుకులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలో ఫేక్ కరెన్సీ ముఠా గుట్టు రట్టయింది. నకిలీ కరెన్సీ నోట్లు చలామణి చేస్తున్న ఐదుగురిని మంగళవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తణుకు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో సీడీఎం మెషీన్‌లో జమ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పాలకొల్లు మండలం ఉల్లంపర్రుకు చెందిన అడబాల ఆంజనేయ మూర్తి, పోడూరు మండలం జిన్నూరుకు చెందిన జుత్తిగ నాగరాజు, యలమంచిలి మండలం కాజగ్రామానికి చెందిన దిగుమర్తి ఏసు, భీమవరం మండలం యల్లమెల్లిపురం గ్రామానికి చెందిన తోట రామచంద్రరావు, తణుకు ఎన్జీవో కాలనీకు చెందిన పినిశెట్టి చక్రధర్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,67,600 విలువైన రూ.200 నోట్లు 838 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఇదే కేసులో మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. తణుకు ఎన్జీవోకాలనీకి చెందిన పినిశెట్టి చక్రధర్ గత నెల 15న స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద సీడీఎం ద్వారా తన ఖాతాలోకి 200నోట్లు మొత్తం రూ.16,600 నగదును జమ చేశాడు. ఆ నగదు జమ కాకపోవడంతో అదే నెల 21న బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు బ్రాంచి మేనేజర్ విరోతి సోమశేఖర్‌తో కలిసి సిబ్బంది మెషీన్ తెరచి చూడగా జమ చేసేందుకు ప్రయత్నించిన 83 నోట్లు జమ కాకపోగా అక్కడే ఇరుక్కున్నాయి. అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ కరెన్సీ అని తేలడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ కె.ప్రసాదు బృందంగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. కేసులో నిందితులను అరెస్టు చేయడానికి సహకరించిన సీఐ కొండయ్య, ఎస్ఐ ప్రసాదు, ఏఎస్ఐ పోలయ్యకాపు, హెడ్ కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ అప్పారావు, శివాజీ, మోహన మురళీకృష్ణలను అభినందించారు. వీరికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి రివార్డులను అందజేశామన్నారు. ట్రైనీ డీఎస్పీ కె.మానస తదితరులు పాల్గొన్నారు.

## 5న తణుకులో యోగాంధ్ర

తణుకు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 6 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్లు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఉచిత వైద్య సేవలు

తణుకు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్. బి.రమేష్‌చంద్రబాబు పరీక్షలు చేసి 31మందికి రిపోర్టులు అందజేసారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాదు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విగ్రహాలకు గ్రామోత్సవం



కాళ్ళ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీసలి గ్రామదేవత పోలేరమ్మ, పోతురాజు ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించబోయే నూతన రాతి విగ్రహాలను మంగళవారం గ్రామంలో ఊరేగించారు. తొలుత సాయిబాబా ఆలయం వద్ద విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలు, కేరళ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామన్నారు. గురువారం ఉదయం 8.49 గంటలకు నూతన విగ్రహాల ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కట్రెడ్డి సురేష్‌కుమార్, నూకల భోగేంద్రబాబు, తోట రామదాసు, గణేశ్న నల్లశ్రీను, పద్మారావు, కొమ్మన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కడం ఆరోగ్యం



భీమవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా వన్‌టౌన్‌లోని బీవీ రాజు వీరమ్మ పార్క్ సమీపంలో చిన్నారులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు మాట్లాడుతూ 1817 సంవత్సరంలో చక్రం ఆధారంతో కనుగొనబడిన సైకిల్ మానవ జీవితానికి ఎంతో దోహదపడిందని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ సైకిల్ ఉపయోగించడం ద్వారా కాలుష్యం నియంత్రణతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని అన్నా రు. చాన్‌బాషా, ఎస్.వెంకటేశ్వరరావు, మహ్మద్ సరోజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలువ ప్రక్షాళన పనుల పరిశీలన

కాళ్ళ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంట కాలువలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఉండి నియోజకవర్గంలో కాలువల ఆక్రమణలు తొలగించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారని ఉండి డీసీ చైర్మన్ తోట ఫణిబాబు అన్నారు. సీసలి గ్రామ పరిధిలో ఓల్డ్ సీసలి ఛానల్ పంట కాలువ ప్రక్షాళన పనులను మంగళవారం పర్యవేక్షించారు.

## ఎమ్మెల్యే చొరవతో ట్యాక్సీ డ్రైవర్ల సమస్య పరిష్కారం



ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు సమస్యలు వివరిస్తున్న ట్యాక్సీడ్రైవర్లు

గణపవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో ట్యాక్సీడ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. గణపవరం ట్యాక్సీడ్రైవర్ల యూనియన్ నాయకులు ర్యాలీగా సోమవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో ట్యాక్సీడ్రైవర్ల యూనియన్ చిన్నపాటి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నామని దాన్ని తొలగి ంచాలని ఆర్‌టీసీ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని యూనియన్ నాయకులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దీర్ఘకాలికంగా అక్కడ చిన్నపాకలో ట్యాక్సీ కార్యాల యం ఏర్పాటు చేసుకున్నామని ట్యాక్సీలను వేరేచోట పెట్టుకున్నామని అయితే తమ కార్యాలయాన్ని తరలించకుండా కాపాడాలని వారు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్‌టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

## రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 5వ తేదీన రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపరితిత్తులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్తపరీక్షలతో పాటు, ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తారన్నారు.

## ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

పెంటపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాలలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు.

## బాధితులకు ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొంద్రుపోలు భగత్‌సింగ్ కాలనీకి చెందిన గంజ శ్రీనివాస్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద తన సొంత నిధులు రూ.25 వేలు అందజేశారు. అలాగే ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడ్డ గణేశుల పవన్‌కళ్యాణ్‌కు జనసేన పార్టీ నుంచి రూ.15,700 అందజేశారు. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన జనసైనికుడు గంధం నాగేంద్ర ఇటీవల మృతి చెందడంతో జనసేన నాయకుడు పైబోయిన వెంకటరామయ్య రూ.50 వేలు అందజేశారు.

## క్రీడాకారిణి కుసుమకు మంత్రి అభినందన



క్రీడాకారిణి రావాడ కుసుమను అభినందిస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా గుర్తింపు సాధించిన రావాడ కుసుమను యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. వీరవాసరంకు చెందిన కుసుమ మంగళవారం మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయంలో కలిసిన సందర్భంగా అభినం దించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో లాంగ్ జంప్‌లో చాంపియన్‌గా నిలిచిన కుసుమ జిల్లాకే గర్వకారణమన్నారు.

## బీర్ బాటిల్‌తో దాడి

తణుకు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపర్చిన ఘటన మంగళవారం రాత్రి తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో చోటు చేసుకున్నది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దువ్వ గ్రామానికి చెందిన బొడ్డు కృష్ణకు, అదే గ్రామంలోని జగనన్న కాలనీకి చెందిన గండికోట జాన్ ఏసులకు పాత కక్షలు వున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి గండికోట జాన్ ఏసు దువ్వ ఆర్చి వద్ద బొడ్డు కృష్ణపై బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపర్చినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన కృష్ణను ఆయన బంధువులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పంట కాల్వ తవ్వి... రోడ్డును పూడ్చేశారు



ఆందోళన చేస్తున్న రైతులు

నరసాపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టవరం శింగంశెట్టి పంట కాల్వ తవ్వి రైతులు పొలాలకు వెళ్లే రహదారిని మట్టితో పూడ్చేశారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లాలన్నా.. ధాన్యాన్ని ఒడ్డుకు తెచ్చుకోవాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం ఈ మట్టిని తొలగించి మార్గాన్ని ఏర్పాటు చేయాలని మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. లేని పక్షంలో తాము అన్ని విధాలుగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ కాల్వ వెంబడి ఉన్న మట్టిని సాగునీటి సంఘాల ద్వారా తొలగిస్తామని చెప్పారు.

# ‘పాకా’కు నాయకుల ఘన స్వాగతం



పాకాకు స్వాగతం పలికేందుకు బయలుదేరిన పాలకోడేరు గౌడ సంఘ నాయకులు

ఆకివీడు/ఉండి/పాలకోడేరు/నరసాపురం టౌన్/, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసి మంగళవారం ఆకివీడు వద్ద జిల్లాలోకి అడుగుపెట్టిన పాకా సత్యనారాయణకు కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక గౌడ సంఘం వీధిలో మేకా శేషుబాబు, టీడీపీ కార్యాలయం దగ్గర మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, జనసేన పార్టీ కార్యాలయం పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు నేతృత్వంలో గజమాలలు, పూలమాలలు వేసి సత్కరించారు. ర్యాలీ ఆకివీడు నుంచి ఉండి మండలం చెరుకువాడకు చేరుకోగానే నాయకులు కార్యకర్తలు వెళ్లి ఆయనకు పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఉండి అసెంబ్లీ కోకన్వీనరు గాదిరాజు వెంకటేశ్వరరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు యర్రా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. పాలకోడేరు మండలానికి చెందిన గౌడ సమాఖ్య నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఉప్పుటేరు వంతెన వద్దకి కార్లతో, బైక్‌లతో భారీగా తరలివెళ్ళారు. కార్యక్రమంలో గౌడ సంఘం గౌరవాధ్యక్షులు అంగర సుబ్బారావు, అధ్యక్షులు కారింకి సాయిబాబు, ఉపాధ్యక్షులు చిటికెన పుల్లయ్య, కార్యదర్శి బెజవాడ సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు యిర్రింకి ధనలక్ష్మి, యిర్రింకి శ్రీనివాస్ పాల్గొన్నారు. నరసాపురం బీజేపీ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికేందుకు భారీగా భీమవరం తరలి వెళ్లారు. బీజేపీ కన్వీనర్ మేకల సతీష్ ఆధ్వర్యంలో పట్టణ, మండల, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 500 బైక్‌లపై మొగల్తూరు మండలం కాళీపట్నం మీదుగా భీమవరం ర్యాలీగా బయలుదేరివెళ్లారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకే వెన్నుపోటు దినం



వలవల బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరిన పరిమెళ్ళ వైసీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణాలన్నీ ఒక్కొక్కొటిగా బయటకు రావడంతో రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్ళించేందుకు వెన్నుపోటు దినం పేరుతో ఆపార్టీ నాయకులు డ్రామాలు అడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి ఏద్దేవా చేశారు. పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ వరుసగా అమలు చేస్తుందన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్ ఆధ్వర్యంలో పరిమెళ్ళ గ్రామం నుంచి సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజులతో పాటు మరికొంత మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ఉదయబాస్కరరావు పాల్గొన్నారు.

### ఓర్వలేకే వైసీపీ విమర్శలు

నరసాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు పెండ్ర శ్రీనివాస్ మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఏ స్థితిలో ఉందన్న విషయం ప్రజలందరికీ తెలుసున న్నారు. అందుకే ఆపార్టీకి ఎన్నికల్లో 11సీట్లే ఇచ్చార న్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పించన్ పెంపుదల, ఉచిత గ్యాస్ ఇచ్చామన్నారు. వైసీపీ ఎన్ని దొంగ నిరసనలు చేసినా ప్రజలకు ఒరగేది ఏమి లేదన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహిద్దామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ శేషులత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగే అభివృద్ధిపై సమావేశానికి మండల స్థాయి అధికారులు వివరించారు. తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ డిపోల వద్దే రేషన్ అందిస్తున్నామని, మండలంలో 8011 మంది వృద్ధులు, వికలాంగులకు రేషన్‌ను డీలర్‌లు స్వయంగా ఇంటికే పట్టుకెళ్లి అందిస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ ఉపాధిహామీ నిధులతో రూ.70 లక్షలతో రోడ్లు నిర్మించామని వివరించారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, వైస్ ఎంపీపీ రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల పరిశీలన



తాళ్ళకోడులో ఇళ్లస్థలాలు పట్టాలు వెరిఫికేషన్ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఆకివీడు రూరల్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గృహాలు నిర్మించుకోవడానికి పేదలు, మధ్యతరగతి లబ్ధిదారులు ముందుకు రావాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆకివీడు మండలం తాళ్ళకోడు ఇళ్ల స్థలాలను మంగళవారం రాత్రివరకు ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జేసీ స్వయంగా లబ్ధిదారులు ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ఇచ్చిన పట్టా, ఆధార్‌కార్డులు పరిశీలించారు. మేనెల 30వ తేదీ నుంచి తాళ్లకోడులో ఇళ్లస్థలాలు రివెరిఫికేషన్ జరుగుతున్నదని తెలిపారు.

## ఆర్‌సీబీ గెలవాలని పూజలు

భీమవరం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టిన ఆర్‌సీబీ ఫైనల్‌కు చేరింది. మంగళవారం జరిగే ఫైనల్ పోటీల్లో పంజాబ్‌తో ఆర్‌సీబీ తలపడుతున్నది. ఈ క్రమంలో ఈసారి ఎలాగైనా బెంగళూరు కప్ గెలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఆర్‌సీబీ గెలుపు కోసం కొందరు పూజలు సైతం మొదలుపెట్టారు. ఓ అభిమాని భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారికి మంగళవారం ఆర్‌సీబీ గెలవాలని పూజలు చేశాడు. చీటీ రాసి అమ్మవారి వద్ద ఉంచారు.

## మహిళలకు యోగాపై శిక్షణ

పాలకొల్లు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 20, 21 వార్డులకు చెందిన పలువురు విద్యార్థులకు, వార్డుల్లోని మహిళలకు యోగాపై శిక్షణ నిర్వహించారు. ఈనెల 21వ తేదీ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఎల్‌కె స్కూల్ ఆవరణలో వార్డు నాయకుడు కొర్రగింజల రవి శంకర్ యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈసందర్భంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను రవి శంకర్ వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పొట్నూరి శ్రీనివాస్, కొర్రగింజల వరలక్ష్మీ, వార్డు మహిళలు పాల్గొన్నారు

## అన్నసమారాధన

పాలకొల్లు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కెనాల్‌రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కటికిరెడ్డి సత్యనారాయణ దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ‘రేషన్ సరుకుల రద్దుకు ప్రభుత్వం కుట్ర’

భీమవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రేషన్ వద్దనుకుంటే నగదు బదిలీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు గోపాలన్ తెలిపారు. ఈ నిర్ణయం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని అన్నారు. క్రమక్రమంగా రేషన్ సరుకులు తీసుకోకుండా రేషన్ సరఫరా షాపులను పూర్తిగా తీసేయాలనే ఆలోచలో ప్రభుత్వం ఉన్నదని అన్నారు.



## శ్రీరాముడికి గ్రామోత్సవం

మొగల్తూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాములవారి శోభాయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు గ్రామంలోని కడలివారిపాలెంలో సీతారామచంద్రస్వామి ఆలయం పునః నిర్మాణం చేసి నూతన విగ్రహాలను ఈనెల 5వ తేదీన ప్రతిష్ఠించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం గ్రామస్థులు సీతారమచంద్రస్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

## హామీలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని సీపీఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథపురంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాసరాజుకు వినతిపత్రం అందించారు.

## బాలికలు విద్యలో రాణించాలి

తణుకు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామంలోని కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు మాట్లాడారు. బాలికలు ఎస్‌ఓఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

తణుకు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 15 మందికి 8.10లక్షల చెక్కులను కూటమి నాయకులు అందజేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు మేరకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, వైస్ చైర్మన్ వల్లూరి మోహన్, కూటమి నాయకులు చిక్కాల వేణు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సైకిల్ బహూకరణ

పాలకొల్లు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గరల్స్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని మాదిరెడ్డి ప్రణీతాదేవికి సైకిల్ అందించారు. ఈసందర్భంగా వాసవీ కళ్యాణ మడపం వద్ద (చినగోపురంవీధి) జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ట్రెజరర్ పోతుల ఉమా శంకరరావు, యోగా శిక్షకుడు జవ్వాది కళ్యాణ్ పాల్గొన్నారు.

### ఒంటి పూట మంచినీటి సరఫరా

అత్తిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద గల చెరువులో నీరు అడుగంటినందున ట్యాంక్‌ల నుంచి కేవలం ఉదయం పూట మాత్రమే మంచి నీటి సరఫరా చేస్తామని గ్రామ పంచా యతీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. కాలు వలు వచ్చేంత వరకు ఒక పూట మాత్రమే నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఆలయానికి కూలర్లు బహూకరణ

పాలకొల్లు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక 12వ వార్డులోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్థానిక యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్(యుకేఎస్‌సీ) ఆధ్వర్యంలో రెండు కూలర్లు (ఒకొక్కటి రూ.20వేలు) మంగళవారం బహూకరించారు. క్లబ్ సభ్యులు మద్దాల రాంప్రసాద్, వాసు, కటారీ నాగేంద్ర సహకారంతో కూలర్లను డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పి రామమోహన్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జె.మదన్, వి.దుర్గా ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



## పశువుల దాణా పంపిణీ

పాలకోడేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలంలో పశువులు ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ చేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ టి.హేమ తెలిపారు. మంగళవారం పాలకోడేరు, గొరగనమూడి గ్రామాలకు చెందిన పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొరగనమూడి గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, గొట్టుముక్కల వెంకట రామరాజు, టీడీపీ నాయకులు గుత్తుల ఏడుకొండలు, వీఎల్‌వో జయలక్ష్మి, వీఏ జగదీష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన

భీమవరం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ కవర్ల వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, దీని వల్ల రాబోయే తరం వారికి ఇబ్బందులు కలిగించవద్దని కోరుతూ కళాకారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం ప్రశాంత కుమార్, తిరుపతి కుమార్ బృందం బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు, ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాలను తెలిపారు. మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునే విధంగా అవలంభించ వలసినటువంటి అంశాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కళాకారుల బృందం చేత కళాజాతా ప్రదర్శన నిర్వహించారు.

## మోటార్ సైక్లిస్టుకు గాయాలు

ఉండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉండి పంచాయతీ పరిధిలోని రామాపురం వద్ద ద్విచక్రవాహనదారుడిని లారీ ఢీకొట్టింది. ఉండి నుంచి రామాపురానికి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య వరలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నజీరుల్లా తెలిపారు.

## నేడు వైసీపీ ఆందోళన

నరసాపురం టౌన్, 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేయనున్నారు. అక్కడ కొద్ది సేపు ఆందోళన చేసి ఆర్డీవోకు వినతిపత్రం అందించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

**కాళ్ళ:** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం విజయవంతం చేయాలని వైసీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. పెద అమిరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ కంటే తాను ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తానని సీఎం చంద్రబాబు అబద్ధాలు చెప్పారని విమర్శించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

## కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నరసాపురం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలంటూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. భూమిలేని కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం కౌలు చట్టాన్ని వెంటనే అమలు చేసి రాయితీలు వర్తింపజేసేలా చూడాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామాంజనేయులు డిమాండ్ చేశారు.



విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

## మంచి చెడులపై అవగాహన

నరసాపురం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల్ని టీడీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి పరిశీలించారు. విద్యార్థులకు మంచి, చెడుల మధ్య ఉన్న వ్యత్యాసంపై అవగాహన కల్పించారు. చదువుతో పాటు సమాజంలో ఉన్న మంచి విషయాలను తెలుసుకోవాలన్నారు. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. గ్రంథాలయ అధికారి కుమారి, శాస్త్రవేత్త సుబ్బారావు, బండి స్వర్ణలత, ఆత్మూరి రమ, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. 23, 30 వార్డు సచివాలయాల వద్ద మంగళవారం సీపీఎం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు పలు హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చే సరికి హామీలను విస్మరిస్తున్నారని అన్నారు. రేషన్ వాహనాలు రద్దు వల్ల దూర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రేషన్ సరుకులు పెంచాలని, నగదు బదిలీ ప్రవేశ పెట్ట వద్దని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వర రావు, వై అజయ్ కుమార్, తాళబత్తుల గంగరాజు, మల్లుల లక్ష్మీనారాయణ, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీ పరిశీలన

అత్తిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చౌక డిపోల ద్వారా నిత్యావసర వస్తువులు తెచ్చుకోలేని దివ్యాంగులు, వృద్ధులకు వారి ఇంటి వద్దే రేషన్ పంపిణీని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ పరిశీలించారు. అత్తిలి, గుమ్మంపాడు గ్రామాలలో వృద్ధుల ఇళ్లకు వెళ్ళి వారికి నిత్యావసర వస్తువులు డీలర్లు అందజేసినది లేనిది పరిశీలించారు.

## మిద్దె తోటల పెంపకంతో ఆదాయం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మిద్దె తోటల పెంపకం, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుతో ఆదాయం పొందవచ్చని, ముఖ్యంగా మహిళలు ఉద్యాన సాగుతో చరిత్ర సృష్టించవచ్చని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేఖ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో వికసిత్ కృషి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమణరావు, ఉపసర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.